కథ

# రూప వస్తువు

- జగద్ధాత్రి

ప్రియమైన రహీమ్!

నీకు తెలుసుగా ఫోన్‌లో చెప్పలేని విషయాలు, విశేషాలున్నప్పుడు నేను నీకు ఉత్తరం రాస్తానని. నిజంగా భలే చిత్రమైన విషయంలే. నీకు ఎప్పుడెప్పుడు చెబుదామా అని మనసాగలేదనుకో. మొన్న శ్రీ నేను చెన్నై వచ్చాము. ఆయన ఆడిట్ పని మీద వస్తుంటాం తెలుసుగా. ఇప్పుడు చెన్నై నుండే ఈ ఉత్తరం రాస్తున్నా. వైజాగ్‌లో ట్రైన్ ఎక్కామోలేదో మా కంపార్ట్‌మెంట్‌లో ఓ విచిత్రమైన దంపతుల్ని చూశాను. ఆమెకో నలభై అయిదు సంవత్సరాలుంటాయి. మనిషి ఎత్తరి, ఎత్తుకు తగ్గలావు. మనిషి బొద్దుగా నదురుగా వుంది. ఆమె భర్త 'ఏభై ఏళ్లుంటాయోమే. ఆమెకు కరెక్ట్‌గా వ్యతిరేకంగా వున్నాడు. నల్లగా, బట్టతల, భయంకరంగా ఉన్నాడనొచ్చు. ఇద్దరూ అస్సలు ఒకరికొకరు మేచ్‌కారు. ఇలా ఎందర్నో చూస్తుంటాం. అది పెద్దగా పట్టించుకోదగ్గ విషయం కాదులేనని నేను పెద్దగా పట్టించుకోలేదు. మా బెర్త్‌ల మీద కూర్చుని భోజనం చేస్తున్నారు. కనీసం అడగనైనా అడగకుండా వాళ్లు భోజనం చేసి లేచే వరకు మేం ఎదురుగా కిటికీ పక్క బెర్త్‌మీద కూర్చోవలసి వచ్చింది. అటు పక్క రెండుబెర్త్‌లు వాళ్లవి. వాళ్లటు వెళ్లాక మేం సామాన్లు సర్దుకుని కూర్చున్నాం. నేను, శ్రీ ఏదో సాహిత్యం గురించి మాట్లాడుకుంటున్నాం. సండే మేగజైన్‌లో వచ్చిన నీ కథ గురించి చెబుతున్నా, "బాగా రాశాడురా, అయినా అలవోకగా కథ రాసేస్తాడు రహీమ్" మెచ్చుకోలుగా అన్నారు శ్రీ నీ కథ విని. మంచి ఇతివృత్తం. మనిషి మృదువైన స్పర్శని ఎంతలా కోరుకుంటాడో. లక్ష మాటలు చెప్పలేనిది, ఒక్క స్పర్శతో ఎలా చెప్పచ్చో బాగా రాశాడు అనుకున్నాం ఇద్దరం.

అప్పటికి బండి తుని దాటిందనుకుంటాను. ఆ భార్యాభర్తలిద్దరూ కాసేపు పడుకుని లేచారు. ఇద్దరూ కిటికీ పక్క బెర్త్ కదా ఒకరికొకరు ఎదురుగా కూర్చున్నారు. ఇటుపక్క బెర్త్‌లో మేం, మా ఎదురు బెర్త్‌లో కొత్తగా పెళ్లై వీసా స్టాంపింగ్‌కోసం చెన్నై వెళ్తున్న ఓ అనకాపల్లి అమ్మాయి, అమెరికా అబ్బాయి భార్యాభర్తలున్నారు. వాళ్ల మాటలు బట్టీ తెలిసిందిలే. వాళ్ల లోకంలో వాళ్లున్నారు.

"సాహిత్యంలో ఈ రూపాన్ని గూర్చి వస్తువు గూర్చి ఇన్ని చర్చలు అనవసరం, వస్తువు బట్టే (ఇతివృత్తం) రూపం వస్తుంది. వస్తు సాంద్రతను బట్టి అది కవితగానో, కథగానో రూపుదిద్దుకుంటుంది" చెప్తున్నారు శ్రీ. మన సోక్రటీసు శ్రీగారు ఏంచెప్పినా ఎన్నిసార్లు చెప్పినా, ఇంకా వినాలనే ఉంటుంది. ప్రతి విషయం కొత్తగానే వుంటుంది. అయినా నీకూ, నాకూ ఈ విషయం కొత్తకాదుగా. శ్రద్ధగా వింటున్నా. ఇంతలో వినిపించింది ఆ శబ్దాన్ని భాషలో ఎలా రాయాలో తెలియటం లేదు. చాచి చెంపమీద ఛెళ్లున చరచికొట్టిన చప్పుడు. ఆ భర్త తన భార్యను కొట్టాడని అర్థమైంది. మా ఎదురుగా కూర్చున్న కుర్ర జంట, పై బెర్త్ మీద పడుకున్న నౌవల్ అబ్బాయి, మొత్తం అందరూ ఎదురుగా కూర్చున్న ఆ భార్యాభర్తలవైపు చూశారు. నాకయితే వాళ్లిద్దరూ దెబ్బలాడుకుంటున్నారేమోనని చూడటానికి కూడా భయం వేసింది. ఒక్క నిమిషం అందరూ ఫ్రీజ్ అయినట్టు నిశ్శబ్దం. ఆ తర్వాత వాళ్లిద్దరూ నవ్వులు. అప్పుడు చూశాను ఆశ్చర్యంగా వాళ్లవంక. ఇక మొదలయిందిరా నాయనా విజయవాడ వరకూ వాళ్ల దెబ్బల ప్రహసనం. ఇద్దరూ ఏదో మాట్లాడుకోవడం, ఆయన వెకిలిగా నవ్వడం – ఆ నవ్విన అరక్షణంలోనే ఆమెను ఫాట్‌మని ఎక్కడ పడితే అక్కడ చరిచి కొట్టడం (కొట్టడం అంటే మామూలుగా, సరదాగా కాదు తట్లు తేలేంత గట్టిగా) ఇద్దరూ కాసేపు నవ్వులు.


నేను వాళ్లిద్దర్నీ గమనించడం చూశారు శ్రీ "చలం అయితే ఓ కథ రాసే వాడు" అన్నాను. "అంతెందుకు మన రహీమ్ చూసినా ఖచ్చితంగా మంచి కథ రాస్తాడు" అన్నారు నవ్వుతూ శ్రీ.

"ఏమిటండీ అది!" అన్నా.


"అదోరకం ఎగ్జిబిషనిజమ్‌రా చూడకు అటు"

"చాలాగట్టిగా కొడుతున్నాడండీ" జాలిగా అన్నా.

"ఆవిడకు లేని బాధ నీకెందుకురా!" నవ్వేరు శ్రీ.



"నవ్వకండి. నాకు ఒళ్లు మండుతుంది. అన్నిటికీ చల్లగా నవ్వుతారు" అన్నా ఉక్రోషంగా. ఇంతలో మళ్లీ గిలిగిలిమని వాడి వెకిలి నవ్వు – మళ్లా ఫాట్‌మని శబ్దం. ఈసారి ఆమె దేహంలో ఎక్కడకొట్టాడో ఇంక చూడటానికి కూడా భయం వేసింది. ఇంకా విను, వాళ్లకో టీనేజ్ టెన్త్‌క్లాస్ పాసయిన కొడుకున్నాడు. బాగా డబ్బున్నట్లుంది. చూస్తే తెలుస్తోంది. వాళ్ల బట్టలూ, ఆవిడ నగలూ చాలా వున్నాయి. ఆ అబ్బాయేమో మీద బెర్త్ మీద చేరి పిచ్చిగా సినిమా పాటలు పాడుకుంటూ ఒక్కడూ పడు కున్నాడు. తల్లిదండ్రుల



గురించి అస్సలు పట్టించుకోవటం లేదు. వాడి కిది అలవాటేనేమో.

ఇక నా ధ్యాస మళ్లించడానికి శ్రీ నన్ను మాటల్లో పెట్టారు. (అన్నట్లు మరిచిపోతాను – రేపు చలం జయంతికి మనం వైజాగ్‌లో మంచి ప్రోగ్రామ్ చేస్తున్నాం. సెలవులేదు అదీ ఇదీ అనకు. నువ్వు రావాలి) చలం చూస్తే ఈ దాంపత్యాన్ని ఎలా వర్ణించేవాడంటావు? వర్ణించడం మాట ఎలా వున్నా భోరుమని గుండెలు బాదుకుని ఏడ్చేవాడు. మళ్లీ నేను ఆలోచనల్లో పడడం చూసి ''ఏంట్రా దీర్ఘాలోచన. ఏదీ కాళ్లిలా చాపుకో నా ఒళ్లో పెట్టుకో'' అంటూ నా కాళ్లు తీసి తన ఒళ్లో పెట్టుకోబోయారు శ్రీ.

''అబ్బా వద్దండీ మీరే కాళ్లు పెట్టుకోండిలా అసలే అలసిపోయారు. మళ్లా రేపు చెన్నైలో నాలుగు రోజులూ ఆడిట్‌లు బిజీయే గదా ఒక్కక్షణం ఊపిరాడదు'' అన్నా శ్రీ ధ్యాసలో పడిపోతూ.

''రహీమ్ కథలు ఎన్ని ట్రాన్స్‌లేట్ చేశావూ?'' శ్రీ

''నాలుగు చేశానండీ. ఈరోజు వచ్చిన కథ కూడా చాలా బాగుందండీ. ఇంకో కో ఇన్సిడెన్స్ చూశారా ఇప్పుడు. మనం కొన్న ఈ నాలుగు వీక్లీ ల్లోనూ, ఫ్రంట్‌లైన్‌లోనూ కూడా చూడండి. కార్పొరేట్ హాస్పిటల్స్ గురించే లీడ్ ఆర్టికల్స్ వున్నాయి. రహీమ్ డెయిలీలో రాసినది కూడా దానిగురించే. కార్పొరేట్ హాస్పిటల్స్ ఘాతుకాలు ఎంత హృదయ విదారకంగా వున్నాయో''.

''అదేరా సమకాలీన స్పృహ అంటే. రచయిత ఎప్పుడూ సమాజంపై నిఘావేసి ఉండాలి. సామాజిక పరిణామాలపై తనదైన విశిష్ట స్పందనను సాహిత్యంలో నమోదు చెయ్యాలి. ఇది ఈనాటి రచయితల్లో కొరవడుతోంది. ఎంతసేపు కుల,వర్గ, రాజకీయాలతో హృదయాల్నీ, సాహిత్యాన్ని కలుషితం చేసేస్తున్నారు. జాతీయంగా, అంతర్జాతీయంగా అదే కాలానికి జరుగుతున్న విషయాల పట్ల అవగాహన లేకుండా రాస్తున్నారు. పక్క రాష్ట్రంలో ఏం వ్రాస్తున్నారో మనకు తెలియదు. ఇక అంతర్జాతీయ స్పృహ మనకెక్కడిది'' ఆవేశంగా చెప్పుకుపోతున్నారు శ్రీ.

ఇంతలో గిలిగిలి నవ్వు – మళ్లీ ఫాట్‌మని శబ్దం. ఆమె ఆ దెబ్బకి బెర్త్ మీంచి తూలిపడబోయి నిలదొక్కుకుంది. గుండె గుభిల్లుమంది. ఇప్పటి కిప్పుడే అది పదోసారి. నిజంగా ఆవిడెలా తట్టుకుంటోందో. వారి సంభాషణ కూడా చాలా అసహ్యంగా, అసభ్యంగా వుంది.

''ఎందుకలా కొడతారు నన్నూ'' ఆవిడ గారాలు పోతూ సాగదీస్తోంది.

''ఎక్కడికి పోతావే, నిన్ను కొట్టకపోతే ఈ చేతులెందుకే'' వంకరగా అతని సమాధానం. పబ్లిక్ ప్లేస్‌లో ఉన్నామన్న కనీస స్పృహ లేదు వాళ్లకి. ఆ ధ్యాసలో పడి రామసేతు వివాదం గురించి శ్రీ ఏదో చెపుతున్నారు. వినబడటం లేదు. అసలు మనసుకి ఎక్కటం లేదు.

ఇక నేనాయన మాటలు వినడం లేదని శ్రీ వీక్లీ

తీసుకున్నారు చదువుకోవ డానికి (అన్నట్లు ఈ వీక్లీలో 'ఇంద్రజాలిక వాస్తవికత' మీద శ్రీ రాసిన వ్యాసం వచ్చింది చూడు)

''వ్యాసం పూర్తిగానే వేశాడు చూశావా. వాస్తవానికి ఒకింత అద్భుత రసాన్ని జోడించి అవాస్తవం కాకుండా చెప్పడమే ఈ మేజిక్ రియలిజమ్. ఇది మన వాల్మీకిలోనే వుంది అంటారు మన సీనియర్ రచయిత రాజు గారు. నిజమే కదూ'' పత్రికలో తన వ్యాసం పరికిస్తూ అన్నారు శ్రీ.

''జీవితంలో జరిగే సహజమైన అద్భుతాలుగా సాహిత్యాన్ని సృష్టించడం ఒక గొప్పకళ'' రాజుగారి అస్తిత్వం ఆవలితీరాన కథ గుర్తు చేసుకుంటూ పరవశంగా అన్నాను.

''మీదే వీక్లీ?'' హఠాత్తుగా ఆవిడ శ్రీని అడిగిన ప్రశ్నకు ఒక్క క్షణం మేం మాటలాపాల్సి వచ్చింది.

''అన్ని వీక్లీలూ మావే!'' శ్రీ జవాబుకి నవ్వొచ్చింది. మేం నాలుగైదు వీక్లీలు కొని పెట్టుకున్నాం ప్రయాణంలో చదువుకోవడానికి. అదీ సంగతి.

''అది కాదండీ! మీరు నడుపుతున్న వీక్లీ ఏదీ అని – సాహిత్యం గురించి మాట్లాడుతున్నారు కదా'' అతి తెలివిగా అడుగుతోంది. సాహిత్యం గురించి మాట్లాడితే వీక్లీ నడిపే వాళ్లనుకుంటున్న ఆమె మేథకు జోహార్లు.

''ఓ అదా! అందులో నా వ్యాసం ఒకటి వచ్చిందిలెండి దాని గురించి'' ఇష్టం లేకుంటే సంభాషణ తుంచెయ్యడం మన శ్రీగారికి వెన్నతో పెట్టిన విద్య కదా.

ఆవిడ పాపం బిత్తరపోయింది ఈయన ధోరణికి. గుండుగాడు (వాళ్లాయన) బయటికి వెళ్ళినట్లున్నాడు. ఏ.సిలో సిగరెట్టు తాగ కూడదు కదా. పోనీలో ఆ పది నిమిషాలు ఆమెకు రిలీఫ్.

''మన గురించి చెప్పొచ్చుకదా ఆవిడకి'' అన్నా గుసగుసగా

''అంత అవసరం లేదులే'' కళ్లతోనే కసిరారు శ్రీ.

ఇంతలో మళ్ళా జింబో నగర ప్రవేశంలా వొచ్చేశాడు. మళ్ళీ ఏదో పిచ్చి సంభాషణ. మధ్యలోనే దాణా. మళ్ళీ ఫాట్‌మని దెబ్బలు–నవ్వులు. అబ్బా! ఆ దెబ్బలు నాకు తగులుతున్నట్లున్నాయిరా బాబూ. కాసేపయ్యాక గొరిల్లాగాడు బాత్రూమ్‌కి పోయాడు. అప్పుడావిడ నా వైపు తిరిగింది. నా ఒళ్లో తల పెట్టుకుని పడుకున్నారు శ్రీ. ఆయన తల నిమురుతున్నా ఒక చేత్తో, మరో చెయ్యి ఆయన చేతిలో వుంది. ఎందుకో ఆవిడ చూపులో ఏదో పోగొట్టుకున్న బాధ ఒక్క క్షణం కనిపించింది. ఏమోలే నా భ్రమ అనుకన్నా–

''మీరు రాస్తారా?'' అడిగింది మళ్ళీ శ్రీనే.

నన్నడగొచ్చు కదా ఈవిడకిదేం బుద్ధీ! అనిపించిందో క్షణం. ఆడ బుద్ధి కదా! తిట్టకురా రహీమ్ కన్నా! నిజంగానే అనిపించింది.

''ఆc! మేమిద్దరం కూడా'' శ్రీ ముక్తసరి సమాధానం.

''మీ పేర్లు'' ''నా పేరు శ్రీహర్ష. తన పేరు ధరణి''.

''అవే పేర్లతో రాస్తారా, ధరణి పేరు చదివానే ఎక్కడో'' సాలోచనగా ఆమె.

''తను ధరణి పేరుతోనే రాస్తుంది. నావి శ్రీ అనే పేరుతో వస్తాయి''.

''మొన్న ఫలానా వీక్లీలో వచ్చిన 'సాహిత్యం – సమకాలీనత, వ్యాసం మీరు రాసిందే కదూ'' ఆవిడ గొంతులో ఉత్సాహం.

''అవును!'' కొంచెం మంచి అభిప్రాయం కలిగినట్లుంది ఆమె పట్ల. మన శ్రీగారి గొంతు మెత్తబడింది.

''ధరణిగారి కవిత కూడా వచ్చింది కదూ అందులో'' సంభ్రమంగా అడిగింది. నన్నడగొచ్చుగా తల్లీ మా జీవిత వివరాలన్నీ ఇచ్చేద్దును అనుకున్నాను.

''ఆc! అవునమ్మా!'' శ్రీ.

''చాలా బావున్నాయండీ'' అంటూ ఏదో చెప్పబోయింది వచ్చేశాడు మన విలన్ గుండుగాడు. మళ్లీ ఆవిడపాట్లు మొదలు. అరకొరగా వాళ్ల సంభాషణ అర్థం అవుతోంది. ఆవిడేదో హైదరాబాద్ పంపించమని అడుగుతోంది. ''ఎలా వెళ్తావే ఒక్కర్తివీ, ఎవడితో వెళ్తావే'' అంటూ ఏదో అసభ్యంగా వాగుతున్నాడు. మళ్లా రేకుడబ్బాలో రాళ్లు వేసి గిలకరించినట్లు నవ్వు ఫాట్ – ఫాట్ – బాబోయ్ దెబ్బలు. ఆవిడ ఒళ్లంతా కందిపోయి వుండాలి. మనిషి తెల్లగా చక్కగానే వుంది. గులాబిరంగు చీర ఆమె మేని రంగుతో పోటీ పడుతోంది. అసలిలాంటి ఎలుగుబంటితో కాపురం చేస్తున్నందుకే ఆవిడకి పద్మశ్రీ ఇవ్వచ్చంటే ఇంక వీడికున్న ఈ పిచ్చికాంప్లెక్స్ ఏంట్రా నాయనా! అసలన్నిటికన్నా విచిత్రం ఆవిడ నవ్వు... అలా ఎలా నవ్వుతోందో అతని చేతులు రెండూ పట్టుకొని (ఆ కాసేపైనా కొట్టకుండా ఉంటాడని కాబోలు) చెంపలకానించి ముద్దు పెట్టుకుంటోంది. అందరూ చూస్తున్నారని కూడా లేకుండా వంగి అతను (ఆ ఎలుగుబంటి) బుగ్గలమీద ముద్దుపెట్టింది. మళ్లీ ఫాట్‌మనిపించాడామె చెంపలు. బుగ్గలు ఎర్రగా కందిపోవడం కళ్లారా చూశాను. ''ఇదేం గోలరా బాబూ!'' అన్నట్టు చూశాను శ్రీ వైపు.

''గేదెలను కాసేవాడయింటాడు'' కోపంగా అన్నారు శ్రీ.

''అదేమిటండీ అంతగట్టిగానా కొడతాడు. ఆవిడ కాపురం ఎలా చేస్తుందో'' ఝుడుస్తూ అన్నా. ఏమీ అనలేం. అది వాళ్లగొడవ. పోనీ ఆవిడేమైనా ఏడుస్తోందా బాధ పడ్తోందా అంటే అదీ లేదు. కందిపోయిన బుగ్గల్ని సవరించుకుంటూ పకపకా నవ్వుతోంది. ఏమిటో ఈ వింత కాపురం. నిజం రహీమ్! ఇప్పటికింకా అవే ఆలోచన్లు మెదులుతున్నాయి. నీకు ఉత్తరం రాస్తున్నానే కానీ ఇంకా ఆ దెబ్బల శబ్దం వినబడుతోంది. నీకు చెప్పకుండా నీతో శ్వేతతో ఈ విషయం చెప్పకుండా వుండలేనుగా అందుకే ఇదంతా ఇంత వివరంగా రాస్తున్నా. శ్వేత వాళ్లని చూస్తే ఏమంటుందో? ఖచ్చితంగా వాడికి వార్నింగ్ ఇచ్చుండేదేమో. మన కెందుకులే అని సరిపెట్టుకోలేక పోతున్నా. ఏం కాంప్లెక్సులో ఏమో – ఏదో మానసిక రుగ్మతే అది. లేకపోతే పశువును కొట్టినట్టు ఏమిటా బాదటం. తలచుకుంటే ఏడుపొస్తోంది. ఫ్రాయిడ్ ఏం కాంప్లెక్సలయ్యా బాబూ! అనిపించింది. విజయవాడ అరగంటలో వస్తుందనగా విపరీతంగా మేకప్ వేసుకుని (వాళ్లింటికి వాళ్లు వెళ్లడానికి అంత ముస్తాబెందుకో మరి) తయారయ్యింది.

విజయవాడలో దిగిపోయారు.

హమ్మయ్యా! అనిపించింది. అన్నట్లు విజయవాడలో నీకెక్కడైనా తగులు తారేమో వాళ్లు. వద్దులే వాళ్లని చూసి మనం బాధ పడాలి. ఆవిడ నవ్వుకి అర్థం మాత్రం బోధ పడలేదు. సరే! ఉంటానింక. పిల్లలూ (నా బంగారు తల్లులూ) శ్వేత బాగున్నారా. వాళ్లకి నా ఆశీస్సులు.

విత్ లాట్స్ ఆఫ్ లవ్

దీదీ

***

రహీమ్, శ్వేత, పిల్లలు కారు దిగి లోపలికి వచ్చారు. ''అత్తా!'' అంటూ పెద్దపాప సుమ, నన్నల్లు



## మీరే డిటెక్టివ్!?

*నిర్వహణ: అన్య*

### బెలూన్

''పిల్లల దొంగ ఒకడు, బెలూన్లమ్మే నెపంతో యిక్కడ తిరుగుతున్నట్టుగా ఫిర్యాదు చేశారు కాలనీ వాళ్లు'' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

''మరి పట్టుకోవచ్చుగా. బెలూన్లవాడి ఆచూకీ కోసం యింత కష్టపడాలా?'' అన్నాడు డిటెక్టివ్.

''అదే కదా తిరకాసు. వాడు వారానికొకసారి వస్తాడట. రకరకాల బెలూన్లని నోటితో ఊది పిల్లల్ని ఆకట్టుకుంటాడు. మొన్న మిట్టమధ్యాహ్నం కొబ్బరిచెట్టు కొమ్మల్లో చిక్కుకున్న బెలూన్ కనిపించింది. గాలి వీచటం లేదేమో అదికూడా ఎగరలేదు. కొందరు పిల్లలు దానికోసం ప్రయత్నించారు గాని, ఎనిమిది పదడుగుల ఎత్తున వున్న ఆ బెలూన్ వాళ్లకెలా అందుతుంది? ఆ చెట్టుపక్కనే మూడో అంతస్తు డాబా మీద నిల్చున్న ఒకతను బెలూన్ల మనిషి, ఓ కుర్రాణ్ణి తన సైకిలు మీద తీసుకు పోవటం చూశాడట. ఆ తర్వాత మరికాసేపటికి గాని అసలు విషయం తెలియలేదు. వాడు ఆ కుర్రాణ్ణి అపహరించాడని. లక్ష రూపాయలిస్తే తప్ప పిల్లాణ్ణి వదిలేది లేదని నిన్న డిమాండ్ నోట్ కూడా వచ్చిందట'' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

''అపహరణ జరిగే వుంటుందిగాని, పిల్లాడితో పాటు, బెలూన్‌వాణ్ణి కూడా ఎవరో హోస్టేజ్‌గా పట్టుకున్నారు. గాలింపు ముమ్మరం చెయ్యండి'' అన్నాడు డిటెక్టివ్.

బెలూన్లమ్మే వాడు అసలు దొంగ కాదని, డిటెక్టివ్ ఎలా కనిపెట్టాడు?

జవాబు: [illegible]

కుపోయింది. స్వీటీ, చిన్నది "హాయ్ అత్తా!" అని పలకరించింది. శ్వేత నన్ను పలకరించి వెంటనే లోపలికి వెళ్లింది అమ్మని పలకరించడానికి. మా పిల్లలు రమ్య, నవ్య, వాళ్ల పిల్లలతో కలిసి కబుర్లు చెప్పుకుందుకు డాబా మీదికి పారిపోయారు. ఇక నేను, రహీమ్ మిగిలాం."శ్రీ బజారుకి వెళ్లారు. రహీమ్, వచ్చేస్తారు" అన్నా రహీమ్‌కి కాఫీ ఇస్తూ.

రహీమ్! నా గొంతులోని తడికి ఒక్కసారి తలెత్తి నావైపు చూశాడు.

"గొప్ప వింత విషయం రా! చెన్నై నుండి వచ్చేసిన పదిరోజులకి ఓ విచిత్రమైన ఉత్తరం వచ్చింది రా. ఎక్కడినుండో తెలుసా. ఆమె, అదే ఆ రోజు ట్రైన్‌లో ఎలుగుబంటి భార్య దగ్గర్నుండి. పత్రికలో నా అడ్రస్ కనుక్కుందిట. అప్పుడసలు నాతో మాట్లాడటానికే ఇష్టం లేనట్లు నా పక్క చూడనే లేదు. ఉత్తరం మాత్రం నాకు రాసింది". రహీమ్‌ని కాఫీ తాగనివ్వ కుండానే ఉత్తరం చేతిలో పెట్టాను. "వచ్చి రెండు రోజులైంది. నువ్వెలాగూ ఇవాళొస్తావని నీకు చూపిద్దామని ఎదురు చూస్తున్నా..." రహీమ్ ఉత్తరం విప్పుతోంటే అన్నాను.

"ధరణి గార్కి!

ఎందుకో మీతో ఒక్కరెండు మాటలు చెప్పాలనిపించి రాస్తున్నాను. నాకు సాహిత్యం, సంగీతం అంటే వల్లమాలిన ఇష్టం. మంచి సంప్రదాయమైన కుటుంబంలోనే పుట్టాను. కానీ సంపదలేని దాన్ని. మా ముగ్గురు అక్క చెల్లెళ్లలో నేనే అందంగా వుంటాను. నా రూపం చూసి నన్ను కోరి కానీ కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటాననగానే ఎగిరిగంతేసి నాన్న ఈయన కిచ్చి చేశారు. పదవక్లాసు పరీక్షరాసిన మర్నాడే పెళ్లైపోయింది. నా ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా. పెద్దక్కకి ఉద్యోగం, చిన్నక్కకి సంబంధం ఈయన పరపతి వల్లే సాధ్యపడింది. ఆ కృతజ్ఞతతో నాకంటే వయసు బాగా పెద్దదైనా, అందగాడు కాకపోయినా జీవితం మంచి భర్తనిస్తే చాలని ఆశించాను. కానీ ఎందుకో ఆయనలో ఈ విపరీత ధోరణి. మొదట్లో వాళ్ల వాళ్లెదురుగా కొడుతుంటే హాస్యానికనుకుని, తెలియక కొన్నాళ్లు భరించాను. ఆ తర్వాత అర్థం అయింది. అది అతనిలో ఓ మానసిక రుగ్మత. అందరి ముందూ కొడుతూంటే సహించలేక పోయే దాన్ని. ఎదురు తిరిగినా నిజంగా మరీ విచక్షణ లేకుండా కొడతారు. ఈ లోగా పిల్లలు పుట్టారు. మీరు ట్రైన్‌లో చూసిన బాబు కాక మరో అబ్బాయి ఇంజనీరింగ్ చదువుతున్నవాడున్నాడు. ఎటూ పోలేని స్థితి నాది. చదువంతంత మాత్రం. పుట్టింటికి వెళితే రెండో రోజుంటానంటేనే తడుముకుంటారు భోజనం పెట్టడానికి అమ్మానాన్న. అందరిలోకి నా భర్త పెద్ద ఉద్యోగస్తుడు, కోరి చేసుకున్నాడని, మా అమ్మాయి అదృష్టమని మురిసిపోతుంది అమ్మవెళ్లిన ప్రతీసారి నా ఒంటిమీద కొత్త బట్టలు, నగలూ చూసి. కానీ వాళ్లెవరికీ కనిపించని ఈ దెబ్బలు మనసుకి తగిలినవి ఎవరికి చెప్పను. అందుకే. నేను కూడా బండ బారిపోయాను. వెకిలిగా నవ్వుతూ ఆయనతో బాటే పిచ్చిగా ప్రవర్తిస్తున్నాను. అది ఏం జబ్బో దేవుడికే తెలియాలి. మరీ పదిమందిలో ఇంకా ఎక్కువ చేస్తాడు. అది మళ్లీ నేను ఎంజాయ్ చేస్తున్నట్లు నటించాలి, సహకరించాలి లేకుంటే చాలా కొడతాడు.

ట్రైన్‌లో నాతో మాట్లాడనే లేదుకదా ఉత్తరం నాకు రాసిందేంటి అనుకుంటున్నారా? అక్కడ కంపార్ట్‌మెంట్‌లో అంతమందిలో మీ కళ్లల్లో మాత్రమే నా గురించి బాధ కనిపించింది. మిగతా వాళ్లు ఎక్కిరింపుగా, ఏహ్యంగా చూశారు. మృదువుగా, మధురంగా ఉన్న మీ దాంపత్యం చూసేసరికి నేను శాశ్వతంగా కోల్పోయిన ఆనందం గుర్తొచ్చి మరీ బాధించింది. ఒకింత ఈర్ష్య కూడా కలిగింది మీపై. ఏదిఏమైనా ఈ జీవితం ఇక ఇంతే. నా పిల్లల్నైనా జాగ్రత్తగా పెంచుకోవాలని నా ఆశ. మీ ఇద్దరి కథలూ, కవితలూ, వ్యాసాలూ జీవితానికి దర్పణం పట్టేలా వుంటాయి. మనసుకి ఉత్తేజాన్ని విశ్వాసాన్ని కలిగిస్తాయి. మిమ్మల్నిద్దర్నీ ప్రత్యక్షంగా చూడటం నా అదృష్టం. తిండికీ, బట్టలకీ, కార్లూ, బంగ్లాలూ, దేనికీ లోటు లేదు నాకు. ఒక్కమాట చెప్తాను. నా మిడిమిడి జ్ఞానంతో, సాహిత్యంలో వస్తువు బట్టీ రూపం వస్తుందని మీరు మాటాడు కుంటుంటే విన్నాను. అప్పుడు నాకేమనిపించిందో తెలుసా? నా రూపం బట్టీ వాడికి నేనో వస్తువుగా మారిపోయాను సుమా. అనుకున్నాను. అతను ఎలాపడితే అలా వాడుకునే ఓ పెంపుడు జంతువును, ఓ నిర్జీవ వస్తువును అయిపోయాను. ఎదిరించి బ్రతికేశక్తి ధైర్యం లేదు. చివరికి ఎంతో అనురాగంగా ఉండాల్సిన ఆ క్షణాల్లో కూడా కొట్టి హింసిస్తాడు. ఎప్పుడు ఎక్కడ ఎందుకుకొడతాడో తెలీదు. ఏం చెయ్యగలను నిస్సహాయురాలిని. ఎప్పటికైనా ఓ అద్భుతం జరిగి వాడిలో మార్పు వస్తుందేమోననే ఆశతోనే ఇరవై ఏళ్ల జీవితం సాగించాను. ఇంకా ఈ జీవితం ఇంకెన్నాళ్లో.... నా పిల్లలమీదే నా ఆశలు. వాళ్లు ఇలా కాకూడదని ఆశిస్తాను. ప్రార్థిస్తాను. మీతో మనసువిప్పి చెప్పాలనిపించింది ఈ ఇరవై ఏళ్ల వేదనని. అందుకే ఈ ఉత్తరం దయచేసి జవాబు వ్రాయొద్దు. నా అడ్రస్ కూడా ఇవ్వడం లేదు. మళ్లీ కలుసుకునే యోగం ఎప్పుడైనా, ఉంటే ఎప్పుడో... ఎక్కడో.

నా కోసం మీ కళ్లల్లో చిందిన కన్నీటి పొరలకి

కృతజ్ఞతలతో

మీ

సోదరి"

"ఎంత విషాదం దీదీ!" ఉత్తరం ముగించిన పది నిమిషాల మౌనం తర్వాత అన్నాడు రహీమ్. తన కళ్లలో కూడా సన్నటి కన్నీటిపొర. "అవును నాన్నా! లోకంలో అన్నింటికన్నా విచిత్రమైనవి మానవ సంబంధాలే. ఏ నిర్వచనాలకు అందవు. జీవితాన్ని మించిన విచిత్రం ఇంకేమీ లేదు" అన్నా నాకు తెలియకుండానే చెక్కిళ్లమీదకు జారిన కన్నీళ్లని కొంగుతో తుడుచుకుంటూ.

*

రచయిత సెల్ నెం. : 98499 46409

## చిట్‌చాట్



## మనసు దోచుకున్నారు....

రిచా గంగోపాధ్యాయను చూస్తే అమెరికాలో పుట్టి పెరిగిన అమ్మాయిలా కనిపించదు. దక్షిణాది అమ్మాయే అనిపిస్తుంది. 'లీడర్' సినిమాతో సినీరంగ ప్రవేశం చేసిన రిచాకు తెలుగులో ఆఫర్లు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయట! డబ్బు కోసం కాకుండా మనసుకు నచ్చినవే చేస్తానంటున్న రిచాతో చిట్‌చాట్....

*'లీడర్'తో మీ అనుభవాలు?*

**రిచా:** ఈ సినిమాలో నా క్యారక్టర్ పేరు అర్చన. ఓ రాజకీయ నాయకుడు నా తండ్రి. అంతే కాకుండా ఓ న్యూస్ ఛానల్‌లో సిఇఓగా పనిచేస్తుండడంతో అటు మీడియాతోను, ఇటు రాజకీయాలతోనూ సంబంధం ఉంటుంది. పాత్ర పరంగా చూస్తే ఇది నా వ్యక్తిత్వానికి చాలా దగ్గరగా ఉంది. అందుకే సినిమా చేసేటపుడు కొత్తగా అనిపించలేదు.

*తరువాతి చిత్రం?*

**రిచా:** రవితేజతో 'వీర' చేస్తున్నాను. ఇందులో పక్కా సంప్రదాయ సిద్ధమైన అమ్మాయిగా కనిపిస్తాను.

*టాలీవుడ్‌లో మీ ఎంట్రీ గురించి?*

**రిచా:** నా ఫొటోలను శేఖర్‌గారు చూశారట! వెంటనే నన్ను అప్రోచ్ అయ్యారు. అయితే ముందుగా నేను హిందీలో చేద్దామని అనుకున్నాను. కానీ శేఖర్ గారు ఆఫర్ చేయగానే, స్క్రీన్ టెస్ట్ కోసం హైదరాబాద్ వచ్చాను. అన్నీ చకచకా జరిగిపోయి, 'లీడర్'కి సెలక్ట్ అయ్యాను. ఫీల్డ్‌కి కొత్త అయినా, తెలుగు వారు నన్ను బాగా రిసీవ్ చేసుకున్నారు. నా మనసు దోచుకున్నారు. ముందుగా వారికి థాంక్స్ చెప్పాలి.

*షూటింగ్ అనుభవాలు?*

**రిచా:** ప్రతీరోజూ హ్యాపీగా ఉండేది. కెమెరాకి కొత్త అయినా పెద్దగా ఇబ్బంది పడలేదు. మొదటి రోజు మాత్రం నెర్వస్‌గా ఫీలయ్యాను. అంతే!

*దర్శకుడి గురించి?*

**రిచా:** 'హ్యాపీడేస్' అప్పుడే శేఖర్ గారి గురించి వినడం జరిగింది. అయితే ఆయన దగ్గరే నా మొదటి సినిమా చేస్తానని మాత్రం కలలో కూడా ఊహించలేదు. ఆయన నిజంగా చాలా గ్రేట్. ఇంతకన్నా నా దగ్గర మాటలు లేవు.